సిఫారసు ఉత్తరం చదవటం పూర్తి చేసి, ఆ కుర్రాడికేసి చూసాను. అయిదో ఎక్కం అప్ప జెప్పటానికి సిద్ధంగా ఉన్న విద్యార్థిలా విన



# ఉద్యోగం

యంగా చేతులు కట్టుకుని ఉన్నాడు.

రాబోయిన నవ్వుని మందహాసంగా మార్చి, కొన్ని ప్రశ్నలు వేసాను.

"నువ్వు బియ్యేలో ఏం చదివావు?"

"పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్"

"టైపులు వగైరా పాసయ్యావా?"

"ఇంగ్లీషు లోయర్ పాసయ్యాను"

"ఇంకా?"

"అంతే!..."

"డిగ్రీ చేతికొచ్చి ఎన్నాళ్లయింది?"

"రెండు నెలలు"

"రెండు నెలలు..." నవ్వేను. "రెండు సంవత్సరాలు గడిచినా ఉద్యోగం రానివాళ్ళు చాలా మంది ఉన్నారు..."

అతనేమీ మాట్లాడలేదు.

"మీ నాన్న నామీద చాలా ఆశపెట్టుకున్నాడు. అందువల్ల నీకు ఉంటానికి, తిండికీ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేస్తాను..."

"ఫర్వాలేదు సార్! ఏదైనా జాబ్ ఇప్పిస్తే ఎక్కడో చోట... అడ్జస్టయిపోతాను..." బిడియంగా అన్నాడు.

"అదే గద అసలు సమస్య! గ్రాడ్యుయేట్ అయిన ప్రతి కుర్రాడూ ఉద్యోగం కలలు కంటాడు... పట్టా చేతికి రాగానే మెళ్లో దండ వేసి ఉద్యోగం ఇస్తారేమోనని ఎదురు చూస్తాడు. అది నీ తప్పుకాదు. వయసు అలాంటిది. నీకు తెలీదేమో... అమెరికాలో కూడా నిరుద్యోగ సమస్య పుష్కలంగా ఉంది... సరే... నా ప్రయత్నం నేను చేస్తాను... ఈ లోగా నేను చెప్పినట్లు చేస్తూండు..."

"అలాగే సార్"

"అలాగే సార్ అనటం కాదు... నేను చెప్పే పనులు నీకు ఇబ్బందిగాను, విసుగ్గాను, చికాకుగానూ ఉండొచ్చు. అవన్నీ భరించాలి"

"ఎలా ఉన్నా ఫర్వాలేదు సార్... మీరు చెప్పినట్లు చేస్తాను"

"సరే ముందు ఈ వంద ఖర్చులకుంచుకో... అన్నట్టు ఎక్కడ దిగావు?"

"చుట్టాలింట్లో..."

"అయితే సరే... వాళ్లకి ఇబ్బందిలేకుండా చూసుకో... రేపు పదింటికల్లా రా... వచ్చేటప్పుడు ఒక అప్లికేషన్ రాసుకురా..."

"అలాగే సార్..."

"ఇక వెళ్లు..."

మర్నాడు టంచనుగా పదింటికొచ్చాడు.

రాగానే అప్లికేషన్ ఇచ్చాడు.

దస్తూరి ఫర్వాలేదు. గ్రామరు తప్పులున్నాయి. సాంతం చదివి, దాన్ని చించి అతని చేతిలో పెట్టి "బయట పారేసిరా..." అన్నాను.

ఒక్క క్షణం షాక్ తిని, తేరుకుంటూ మౌనంగా బయటకు వెళ్లి కాయితాలు పారేసి వచ్చాడు.

**కేఆర్టీ**

"అప్లికేషన్లు ఎలా రాస్తారో ఇంకా తెలుసుకోవాలి... నీ స్వంత ప్రయత్నంతో ఫరఫెక్ట్‌గా రాసుకువచ్చేదాకా నీ అప్లికేషన్ల గతి ఇంతే!"

అతను గుటకలు మింగుతూ నిలబడ్డాడు.

"నీకో పని చెబుతున్నాను. ఊళ్లో ఉన్న ఆఫీసులకు పూటకి కొన్ని చొప్పున ఎంచుకుని వెళ్లి, అక్కడ ఉద్యోగాలకు అవకాశం ఉందేమో కనుక్కురా. అందులో ఉద్యోగం చేస్తున్న వాళ్లని ఇంటర్వ్యూలాంటిది చేసి, వాళ్లు ఏవిధంగా ఉద్యోగం సంపాయించిందీ నాకు సాయంత్రం వచ్చి చెప్పు... వెళ్లు..."

మౌనంగా వెళ్లాడు.

మూడు నెలలు గడిచాయి.

రోజుకొక అప్లికేషన్ ఇస్తున్నాడు. ప్రతి అప్లికేషన్‌లోనూ అభివృద్ధి కనిపిస్తోంది. వెరైటీగా ఉంటోంది. మూడు నెలల్లోనూ మూడు సార్లు చెప్పులు రిపేరు చేయించాడతను. నేను అతని ఓర్పుకు పెట్టిన పరీక్షలో నెగ్గినట్లే భావించాను.

నిజానికి మరో కుర్రాడయితే, రోజుకొక అప్లికేషన్ తీసుకుని చదివి, చించి పారేస్తున్నందుకు నాకు దేహశుద్ధి చేసేవాడు. నేను అప్పుడప్పుడూ ఇచ్చిన డబ్బుతో అతికష్టం మీద జరుగుబాటు అవుతుంది. అయినా నోరెత్తి మరి కొంత కావాలని అడగలేదు.

"నీ పేరు వాసు కదూ?"

"శ్రీనివాసు..."

"ఓ.కే. శ్రీనివాసూ! రేపు నువ్వు ఉద్యోగంలో చేరవచ్చు... అది కూడా మా కంపెనీ లోనే... జీతం వెయ్యి రూపాయలు..." ఈ మాటకి ఎగిరిగంతేస్తాడనుకున్నాను.

అతనిలో ఎలాంటి 'థ్రిల్' కనపడలేదు.

"ఏమిటీ? నమ్మలేకపోతున్నావా? నేను నిజంగానే చెబుతున్నానోయ్..."

"సారీ సర్..."

"దేనికి సారీ...! జీతం చాలదా? మళ్లీ పెంచుతానులేవోయ్..."

"అది కాదు సార్..."

"మరేమిటి?"

"మీరు చెప్పినట్లే అన్ని ఆఫీసులూ తిరుగుతూండగా మంచి పరిచయాలయ్యాయి సార్... ఒకాయన నాకు రెండువేల రూపాయల ఉద్యోగం ఇప్పించాడు సార్. రేపే వచ్చి చేరమన్నాడు సార్. అందుకని... మీకు థాంక్స్ చెబుదామని వచ్చాను సార్..." ●

---

## ఎందుకబ్బా...?

'మీకు పెళ్లైందా?' ఇంటర్వ్యూలో ప్రశ్నించాడు అధికారి.

అయింది...

ఎక్కడ...?

తెలియదు.

పెళ్లి ఎక్కడయిందో తెలియదా? ఆశ్చర్యంగా అడిగాడు అధికారి.

ఓ... సారీ... 'ఎందుకు?' అని అడిగారేమోననుకున్నాను.

---

## గమనిక

సాహిత్య కార్యక్రమాల ఫొటోలు ప్రచురణార్థం పంపించేటపుడు ఆ కార్యక్రమం జరిగిన తేదీ, స్థలం తప్పక ఉదహరించాలి. ఈ వివరాలు లేకుండా వచ్చే ఫొటోలు ప్రచురణకు స్వీకరించబడవని గమనించగోర్తాం.

– ఎడిటర్